క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి పీహెచ్‌డీ పట్టా


వసుధప్రియ

కాళేశ్వరం: మహదేవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్సీ.వసుధ ప్రియ పీహెచ్‌డీ పట్టా పొందింది. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ప్రొఫెసర్ జీ.సునీత భాయి ఆధ్వర్యంలో 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ సీసీఈ ఇన్ ప్రైమరీ స్కూల్ వరంగల్ డిస్ట్రిక్ట్ ఇన్ రిలేషన్ టూ టీచర్స్ అవేర్‌నెస్ అటిట్యూడ్ అండ్ ట్రెస్' అనే టాపిక్‌ను సెమీనార్‌లో సమర్పించింది. పీహెచ్‌డీ పట్టా పొందడంతో తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

వాజేడు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఏడ్జెర్లపల్లి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ అంజమ్మ అన్నారు. మండల పరిధిలోని పాయబాటలు గ్రామంలో సోమవారం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ఉన్న సమయంలో రక్తహీనత ఉంటుందని ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకం కింద ఇచ్చే భోజనం, పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సతీష్ కుమార్, అంగన్ వాడీ టీచర్లు విజయ నిర్మల తదితరులు ఉన్నారు.

సీజనల్ పంటల సాగుపై అవగాహన

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కర్రావానిగూంపు గ్రామంలో సోమవారం ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, సీజనల్ పంటల సాగుపై అవగాహన సదస్సును కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఈఓ శ్యామ్ హాజరై గ్రామస్తులకు సీజనల్ పంటల సాగుతో వచ్చే లాభాలను వివరించారు. ప్రధాన మంత్రి పసల్ భీమాయోజన పథకం కింద పంటలు నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం చేసేందుకే పంటల పసల్ భీమా యోజన పథకం ప్రవేశ పెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గొంది హనుమంతు, కామేష్, ఇందిర, ఉషా, పద్మ, నరేష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులకు గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి.. కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఇద్దరు అటెండర్లు భాస్కర్, కొమురయ్య జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో జాతీయ రహదారి పక్కన ఉన్న కంకర కుప్పపై గమనించకుండా వెళ్లడంతో ద్విచక్రవాహనం పైనుంచి పడి ఇరువురికి గాయాలయ్యాయి. తోటి ఉద్యోగులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

క్షుద్రపూజల కలకలం

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని తొర్రిచింతలపాడుకు వెళ్లే దారిలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండడంతో ప్రజలు భయపడుతున్నారు. రహదారిపై ముగ్గువేసి పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పాటు జంతువును బలి ఇచ్చినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. గుప్తనిధులకు పూజలు చేసి బలి ఇచ్చారా అనే సందేహాలు నెలకొన్నాయి. సంఘటన స్థలాన్ని ఎస్సై చల్ల రాజు సోమవారం రాత్రి సందర్శించారు. క్షుద్రపూజలు ఎవరూ నిర్వహించారనే విషయంపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటు


తాడిచర్ల పాత గ్రామ పంచాయతీకి చేరుకున్న సామగ్రి


మహదేవపూర్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కు

- పిల్లలకు ఎంతో ఉపయోగకరం
- ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం

మల్హర్: గ్రామీణా ప్రాంతాల్లో పిల్లలకు ఆటకు వీలు కల్పించే వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు అధికారులు చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఈ మేరకు మండల కేంద్రం తాడిచర్ల పాత గ్రామ పంచాయతీ ఆవరణలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయాడానికి సోమవారం ఆట సామగ్రి గ్రామ పంచాయతీకి చేరుకుంది. దీంట్లో భాగంగా సీసా, స్లయిడ్‌లు, రంగుల రాట్నం, శాండ్‌బాక్స్, స్ప్రింగ్ రైడర్, స్వింగులు తదితర వినోద పరికరాలు తీసుకువచ్చారు. అలాగే మల్హర్, కాటారం, మహదేవపూర్ మండలాల్లో కూడా చిల్డ్రన్ పార్కులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మహదేవపూర్ మండల కేంద్రంలో వినోద పరికారులు ఆమర్చగా, కాటారంలో ఆమర్చారు. అలాగే నేడు (మంగళవారం) తాడిచర్ల పాత గ్రామ పంచాయతీలో సంబంధిత కాంట్రాక్టర్ పరికాలు బిగించడాని సిబ్బంది పంచాయతీ స్థలాన్ని చదును చేస్తున్నారు. ఈ పార్కుల్లో ఏర్పాటుతో పిల్లలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం ఉంటుంది. అలాగే శారీరక అభివృద్ధితో పాటు వారు చురుకుగా కదలడం, సమతుల్యతను సాధించటం, శారీరక శక్తి పెంపొందించుకోవడం వంటివి నేర్చుకుంటారు. పిల్లల వారి ఊహాశక్తిని, సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపయోగపడుతాయి. పార్కులో ఇతర పిల్లలతో కలిసి ఆడుకోవడానికి, స్నేహాలు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ పార్కులను మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

హంగు ఆర్భాటాలకే కాంగ్రెస్ పరిమితం

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి


మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి: హంగు ఆర్భాటాలకే కాంగ్రెస్ పార్టీ పరిమితమైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరై మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కొడారి రమేశ్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు నరహరి పద్మవెంకట్‌రెడ్డి, నైనకంటి ప్రభాకర్ రెడ్డి, బెల్లంకొండ మాధవిశ్యాంసుందర్‌రెడ్డి, పిన్నింటి వెంకట్‌రావు, రంగాపురం మాజీ సర్పంచ్ రవీందర్, పెంతల రాజేందర్ రెడ్డి, దానవేణి రాములు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని బంగ్లాపల్లి గ్రామానికి చెందిన కరాబు యువరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం పరామర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గోగుల జగదీశ్వర్ అనారోగ్య కారణాలతో బాధపడుతుండగా ఆయనను ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు బల్గూరి తిరుపతిరావు, కోడారి రమేష్, పిన్నింటి వెంకట్‌రావు, తదితరులు ఉన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల: పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు గాదర్ల రవి, అలియాస్ గణేష్ కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన వెంట వెంట మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బందెల నరేష్, ఎంపీటీసీ పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, సట్ల రవిగౌడ్, శ్రీనివాస్, అచ్చె లచ్చన్న, తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీపై ప్రజావేదిక


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు చేసిన చెల్లింపులు, అవకతవకలపై ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజావేదికను నిర్వహించారు. సోమవారం మహదేవపూర్ మండల ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావేదికను నిర్వహించగా, చేసిన పనులు రూ.4,65,62,098 కాగా, వేతన రూపంలో రూ.3,32,24,593లు, మెటీరియల్ రూపంలో రూ. 1,33,37,505లను చెల్లింపు చేశారు. చెల్లింపులు చేసిన డాక్యుమెంట్లు పూర్తిగా ఆడిట్ బృందానికి అప్పగించి గ్రామాల్లో వారం రోజులపాటు తనిఖీ బృందం పర్యటించారు. కాగా, డాక్యుమెంట్లలో, ఎంబీ రికార్డుల్లో నమోదుచేసిన కొలతలను సరి చూసి, పని జరిగిన ప్రదేశంలో తనిఖీ బృందం సందర్శించి తనిఖీలో గుర్తించిన అవకతవతవకలను ప్రజా వేదికలో చదివి వినిపించారు. ప్రిసీడింగ్ అధికారి పెనాలిటీ, రికవరీ రూ.30,219లు విధించారు. బాధ్యులయిన సిబ్బందికి 15 రోజులలోగా నోటీసులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి జారీ చేసి, బాధ్యులపై చర్యలను తీసుకోనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ ప్రజావేదిక కార్యక్రమంలో ప్రిసీడింగ్ అధికారిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ, జిల్లా విజిలెన్స్ ఇన్‌చార్జ్ అధికారి రూబీనాబేగం, క్వాలిటీ కంట్రోల్ విభాగం నుండి ధరం సింగ్, అంబుస్‌డ్‌మాన్ శ్రీనివాస్ , రమేష్, సునీత, సోషల్ ఆడిట్ స్టేట్ టీం మేనేజర్ అజయ్, స్టేట్ రిసోర్స్ పర్సన్ గంగరాజు, వివిధ గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, జూనియర్ ఇంజనీర్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసకావొద్దు


రేగొండ: మొక్క నాటుతున్న సీఐ మల్లేశ్


మహదేవపూర్‌లో మొక్క నాటుతున్న పోలీసులు

- సీఐ మల్లేశ్

రేగొండ: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సీఐ మల్లేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎస్సై సందీప్ కుమార్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: విద్యార్థులు చెడు వ్యసనాలకు, మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మహదేవపూర్ సీఐ రామచందర్‌రావు అన్నారు. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 'హీల్ యువర్ మైండ్ అండ్ ప్లాంట్ ఏ ట్రీ–సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో మహదేవపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పవన్ కుమార్, ఎస్సై–2 నాందేవ్, ట్రైయినీ ఎస్సై సాయి శశాంక్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడమే లక్ష్యం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు


శ్రీనుబాబును సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కాటారం: ప్రజా సేవ చేయడమే లక్ష్యంగా దుద్దిళ్ల కుటుంబం నిరంతరం ముందుకు వెళ్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై కాటారం వచ్చిన శ్రీనుబాబుకు మండల కాంగ్రెస్ శ్రేణులు మండలంలోని మేడిపల్లి టోల్‌గేట్ వద్ద ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రధాన కూడలిలో శ్రీనుబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనుబాబును కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అధికారం, పదవులతో సంబంధం లేకుండా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి తమ వంతు సేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చిటూరి మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున

మంగపేట: ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని చుంచుపల్లి పీహెచ్‌సి వైద్యాధికారి చిన్నపెల్లి యమున అన్నారు. మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడెంలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో సోమావరం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 46 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 12 మంది జ్వరపీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సీతమ్మ పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి


ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

కాటారం: మండలంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహాముత్తారం మండలం యామన్‌పల్లి చౌరస్తాలో సోమవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పేదవాడికి ఇల్లు ఇస్తానని చెప్పి ఓట్లు వేయించుకున్న ఈ ప్రాంత మంత్రి ప్రస్తుతం పేదోళ్లను పట్టించుకునే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. పక్క నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతుంటే మంథని నియోజకవర్గంలో అర్హులైన వారి జాబితా ప్రకటించకపోవడం సిగ్గు చేటన్నారు. స్థానిక ఎన్నికల కోసం పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ముగ్గుపోయించారని కానీ అర్హులైన లబ్ధిదారుల జాబితా ప్రకటించలేదని ఆరోపించారు. అర్హులైన వారికి ఇప్పటి వరకు కలెక్టర్ ముద్రతో అధికారికంగా ప్రొసీడింగ్‌లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఓట్ల రాజకీయం తప్ప అర్హులైన నిరుపేదలకు ఇళ్లు ఇచ్చే ఉద్దేశం మంత్రి, కాంగ్రెస్ నాయకులకు లేదని విమర్శించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలి

- సీఐ అనుముల శ్రీనివాస్

ఏటూరునాగారం: ఉత్తమ విద్యార్థులను తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. 2024–25 లో టెన్త్‌లో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రిటైర్డ్ మహిళా టీచర్ వరలక్ష్మి పారితోషికాన్ని అందజేశారు. పాఠశాలలో ప్రథమ ర్యాంకు సాధించిన రామ హర్షిత్‌కు రూ.6వేలు, ద్వితీయ ర్యాంకు జాడి రాధిక రూ.5వేలు, తృతీయ బహుమతి జాస్మిన్‌కు రూ.4వేలను స్థానిక వివేకానంద పాఠశాల హెడ్మాస్టర్ పెండ్యాల ప్రభాకర్, హెడ్మాస్టర్ సాంబశివరావు ఆధ్వర్యంలో అందజేశారు. అలాగే 16 మందికి ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున ప్రోత్సహక బహుమతి కింద నగదులను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి


భూపాలపల్లి రూరల్: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


చిట్యాలలో..

భూపాలపల్లి రూరల్: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో, పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిశీధర్‌రెడ్డి పాల్గొని ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని గోర్లవీడులో బీజేపీ మండల అధ్యక్షుడు పులుగుజ్జు రాజు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీసీ మోర్చా నాయకుడు దొంగల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖర్జీ ఆలోచనలు నేటి యువతరానికి ఆదర్శం అన్నారు. నాయకులు శివనాత్రి వేణు, నరాల కొమురయ్య, మండల సమ్మిరెడి, దుండ్ర రాజు, తాళ్ల దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప న్యాయవాదిగా, రాజకీయ వాదిగా జాతీయ భావం కలిగి సమాజ సేవ కలిగినటువంటి మహానీయుడు ముఖర్జీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తీగల జగ్గయ్య, సీనియర్ నాయకుడు సుద్దాల వెంకటరాజవీరు, గుండ సురేష్, గోపగాని స్వామి, వెంకటేశ్వర్లు మార్త అశోక్, రాయిని శ్రీనివాస్, సారంగపాణి, చింతల రాజేందర్, అనుప మహేష్, కేంసారపు ప్రభాకర్, రాకేం శ్రావణ్, సూర శ్రీకాంత్ పాల్గొన్నారు.

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరామ్ మాట్లాడుతూ.. ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలను, త్యాగం మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలపూడి భాస్కర్ రెడ్డి, కొత్త సురేందర్, భూక్య జవహర్‌లాల్ రవింద్ర చారి, సునీల్, రాకేష్ యాదవ్ ఉన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి


స్వర్ణలత (ఫైల్)

టేకుమట్ల: గడ్డి మందు తాగి చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని ఆరెపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన ఇచ్చంతుల సదయ్య–రమల చిన్న కూతురు స్వర్ణలత(30)ను కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన బండి ప్రశాంత్ అనే వ్యక్తితో మూడేళ్ల క్రితం వివాహమైంది. కాగా, ఆమె 20 రోజుల క్రితం తల్లిగారింటికి రాగా మూడు రోజుల క్రితం మనస్తాపానికి గురై ఇంట్లోని గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేపిస్తుండగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

శునకాలతో పరేషాన్..


వీధుల్లో తిరుగుతున్న శునకాలు


రాత్రి సమయంలో స్థానికులపైకి ఎగబడుతున్న కుక్కలు

చిన్నారులు, మూగ జీవాలపై దాడులు

- భయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండలంలోని పలు గ్రామాల్లో శునకాలు విజృంభిస్తున్నాయి. శునకాలను అదుపు చేసేవారు లేక పోవడంతో వీధుల్లో గుంపులు, గుంపులుగా స్వైర విహారం చేస్తు చిన్నారులు, వాహనదారులపై, మూగజీవాలపై దాడులు చేస్తున్నాయి. చిన్న పెద్ద తేడా లేకుండా నిత్యం ఏదో ఒక చోట ప్రజలు గాయాలపాలవుతున్నారు. వీధి కుక్కలతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జనం భయపడుతున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరేత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని పెరికబజారు, అప్పాలవారివీధిలో చిన్నారులపై, బాటసారులపై కుక్కలు దాడి చేయటంతో ఇటీవల గాయాల బారినపడ్డారు. గాయాల పాలైన వారికి వెంకటాపురం వైద్యశాలలో చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. గొల్లగూడెం గ్రామంలో గొర్రెలపై దాడి చేయటంతో 20 గొర్రెల వరకు మృతి చెందాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి వీధికుక్కలను అదుపు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దాడులు చేస్తున్నాయి..



కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తూ బాటసారులు, చిన్నారులు, మూగ జీవాలపై దాడులు చేస్తున్నాయి. దాడుల్లో చిన్నారులు గాయాలపాలవుతున్నారు. గ్రామాల్లో వీధికుక్కల వీధిల్లో తిరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- చిట్టెం ఆదినారాయణ, వెంకటాపురం(కె)

భయమేస్తున్నది..



వీధి కుక్కల దాటికి చిన్నారులను స్కూల్‌కు తీసుకువెల్లాలంటే భయమేస్తున్నది. ఏ వీధిలో కుక్కలు దాడి చేస్తాయోనని కర్ర చేతులో పట్టుకోని పిల్లాలను బడికి తీసుకు వెల్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు వీధికుక్కలు బెడద లేకుండా చర్యలు తీసుకోవాలి

\- ముత్తినేని అనూష, వెంకటాపురం(కె)

రహదారికి మరమ్మతు


మరమ్మతు చేయిస్తున్న పోలీసులు, నాయకులు

వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారిని పోలీసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు శ్రమదానంతో చేసి మరమ్మతులు చేశారు. స్థానిక మీ సేవ సెంటర్ ముందు నుంచి ఉన్న రహదారి గుంతలమయంగా మారి విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎస్సై జక్కుల సతీష్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్, సొసైటీ ఉపాధ్యక్షుడు జగన్నాథ రాజు ఆధ్వర్యంలో గుంతలను పూడ్చారు. అదే విధంగా సంత సెంటర్‌లో సైతం శ్రమదానంతో రహదారి మరమ్మతులు చేశారు.